JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । సోమవారం 23-02-2026
Medchal - Malkajgiri । Monday 23-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 268
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 268 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



## ట్రంప్ మర్డర్ కు కుట్ర



- అక్రమంగా ఇంట్లోకి దూరిన దుండగుడు
- కాల్చి చంపేసిన భద్రతా సిబ్బంది

జయభేరి, న్యూఢిల్లీ:

ఇరాన్ తో ఉద్రిక్తతల వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భద్రత విషయంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రంప్ కు చెందిన ఫ్లోరిడాలోని మార్ ఎ లాగో రిసార్ట్ లోకి అక్రమంగా ప్రవేశించిన ఓ దుండగుడ్ని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది కాల్చి చంపింది. అతడు ఆయుధాలతో ట్రంప్ భవనంలోకి ప్రవేశించినట్లు యూఎస్ సీక్రెట్ సర్వీస్ తెలిపింది. ఈ క్రమంలో అతడ్ని భద్రతా దళాలు కాల్చి చంపినట్లు పేర్కొన్నాయి. ఈ ఘటన ఫిబ్రవరి 22 ఆదివారం తెల్లవారుజామున జరిగింది. అయితే ఈ ఘటన జరిగినప్పుడు ట్రంప్.. తన అధికారిక భవనం అయిన శ్వేత సౌధంలో ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు చెందిన ఫ్లోరిడాలోని మార్ఎ లాగో రిసార్ట్ లోకి ఓ ఆగంతకుడు ఆయుధాలతో దూరాడు. అయితే అక్రమంగా ప్రవేశించిన ఆ దుండగుడ్ని అక్కడి భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఈ విషయాన్ని యూఎస్ సీక్రెట్ సర్వీస్ ధ్రువీకరించింది. అయితే ఘటన సమయంలో ట్రంప్.. వైట్ హౌజ్ లో ఉన్నారు. సాధారణంగా వారాంతాల్లో ట్రంప్ ఈ రిసార్ట్‌లోనే గడుపుతుంటారు. ఈ క్రమంలో ట్రంప్ ఈ రిసార్ట్ లోనే ఉంటారని భావించే ఆ దుండగుడు వచ్చినట్లు తెలుస్తోంది.

"అయితే ఆ దుండగుడికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు ఇంకా వెల్లడించలేదు. తాజా ఘటనతో మార్ఎ లాగో రిసార్ట్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు అధికారులు. ఇక ఇటీవల ట్రంప్ ప్రపంచదేశాలపై విచ్చలవిడిగా టారిఫ్ లు విధించిన విషయం తెలిసిందే. అప్పటికే ఉన్న 10 శాతం టారిఫ్ లను 15 శాతానికి పెంచారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులను కూడా ట్రంప్ పక్కనపెట్టారు.

## ప్రతి మండలంలో స్వచ్ఛ రథం

### చెత్త ఇస్తే సరుకులు, సెలవిచ్చిన చంద్రబాబు




- మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ
- ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటికీ చెత్త డబ్బాలు పంపిణీ

విజయవాడ, ఫిబ్రవరి 22 :

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని 'స్వర్ణాంధ్రప్రదేశ్', 'స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దే లక్ష్యంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తోంఫీ. 'చెత్త నుండి సంపద' సృష్టి చేయాలనే ఆశయంతో రాష్ట్రవ్యాప్తంగా వినూత్న కార్యక్రమాన్ని అమలు చేయడానికి సంకల్పించింది కూటమి సర్కార్. ఇక తాజాగా చెత్త నుండి సంపద సృష్టి జరుగుతుందని చెప్తున్న ప్రభుత్వం చెత్త ఇస్తే సరుకులు ఇస్తారని ప్రచారం చేస్తుంది. ప్రతి మండలంలో స్వచ్ఛ రథం ఏపీ సీఎం చంద్రబాబు తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో పరిశుభ్రతను పెంపొందించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి మండలంలో "స్వచ్ఛ రథం" ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.వారానికి ఒక రోజు స్వచ్ఛ రథం గ్రామాలకు చేరుకుని చెత్త సేకరణ చేపడుతుందని తెలిపారు. ప్రజలు చెత్త ఇవ్వడం ద్వారా ఉచిత నిత్యావసర సరుకులు పొందే అవకాశం కల్పించనున్నామని ఆయన పేర్కొన్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకోనుందని తెలిపారు.

## మిడ్ మానేర్ కెనాల్ లో తుంగను తొలగిస్తున్న రైతులు






# శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం

- 2001లో మొదలైన దేవాదుల రెండు దశాబ్దాలు దాటినా ఇంకా సాగుతూనే ఉంది
- తుమ్మడిహెట్టి నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రయత్నం
- ఆరోపణలు సరికాదు. గోదావరి నదీ జలాలపై శాసనసభలో చర్చ చేద్దాం
- మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ మహాజాతర బ్రహ్మాండంగా సాగింది

జయభేరి, హైదరాబాద్ :

గోదావరి నదీ జలాల వినియోగం, దానిపై తలెత్తిన వివాదాలు, ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్ని అంశాలపై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతామని, ఆ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదని పునరుద్ఘాటించారు.

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ఇంజనీర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాగు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి దేవాదుల ఇంటేక్ పాయింట్ వద్ద మోటార్లను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు స్థితిగతులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణ నీటి హక్కుల విషయంలో శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముందుకు వెళుతున్నాం. అవసరమైన నిధులను సమీకరిస్తున్నాం. ఎంతటి జఠిలమైన సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కారమవుతుందని బలంగా విశ్వసిస్తా. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతూ శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. మాకు ఎలాంటి బేషజాలు లేవు. అధికారుల స్థాయిలో, రెండు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చల్లో తేలకపోతే కేంద్ర ప్రభుత్వం వద్ద, లేదా రివర్ మేనేజ్మెంట్ బోర్డుల వద్ద, ట్రిబ్యునళ్ల ముందు లేదా సుప్రీంకోర్టు వరకు ఏదైనా దశల వారిగా వెళ్లాలి. తెలంగాణ నీటి హక్కులను కాపాడే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదు. నీటి హక్కుల విషయంలో అనవసరమైన గందరగోళానికి గురిచేయొద్దు. సహేతుకమైన విమర్శలు చేయాలి. నికర జలాలు, మిగులు జలాలు, వరద జలాలపై హక్కులను

...మిగతాది 2 లో

## బాధితులకు అండగా నిలుస్తాం


- సీఎం రేవంత్ రియల్ ఎస్టేట్ రాజకీయాలు, హరీశ్ హెచ్చరిక..!!




జయభేరి, హైదరాబాద్ :

ముఖ్యమంత్రి రేవంత్ లక్ష్యంగా మాజీ మంత్రి హరీష్ సంచలన ఆరోపణలు చేసారు. మూసీ సుందరీకరణ పేరిట రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ వేసే ప్రతి అడుగు వెనుక భూ కబ్జాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారమే అని అన్నారు. పేదలకు డబ్బులు లేవని చెప్పే ముఖ్యమంత్రికి.. వందల కోట్లతో క్యాంపు ఆఫీసులకు పైసలు ఎక్కడివని ప్రశ్నించారు. హైదర్‌షా కోటలో మూసీ బాధిత కుటుంబాలకు భరోసాగా ఉంటామని హామీ ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో ఇండ్లు కోల్పోతున్న మధు పార్క్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను పార్టీ నేతలతో కలిసి హరీష్ పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ సుందరీ కరణ పనులు చేపడుతోందని.. అవసరమైతే కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌కు వస్తారని తెలిపారు. ఈ అపార్ట్‌మెంట్‌కు గతంలో కేసీఆర్ మూడుసార్లు వచ్చారని ప్రస్తావించారు.

## అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు






## అట్టుడుకుతున్న కామారెడ్డి

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు వచ్చాయన్న కేంద్రమంత్రి
- కామారెడ్డిలో చల్లారని ఉద్రిక్తతలు
- రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తుందా? భగ్గుమన్న బండి సంజయ్
- బాన్సువాడలో 70 మంది అరెస్ట్ అక్రమం అన్న కేంద్రమంత్రి

కామారెడ్డి :

కామారెడ్డిలో ఉద్రిక్తతలు చల్లారలేదు. కామారెడ్డి వెళ్లడానికి ప్రయత్నం చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిని అరెస్ట్ చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. బిజెపి నేతలు తాము కామారెడ్డి వెళ్లి తీరుతామని స్పష్టం చేయడంతో పోలీసులు అన్ని ప్రధాన రహదారులు, తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ వారు రాకుండా అడ్డుకుంటున్నారు. కామారెడ్డి కి వెళ్లాలని ప్రయత్నిస్తున్న ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేస్తున్నారు.

**కామారెడ్డిలో చల్లారని ఉద్రిక్తతలు**

కామారెడ్డిలో మొదలైన రాజకీయ ఉద్రిక్తత ఇంకా చల్లారలేదు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి కి ప్రభుత్వ

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం

కాపాడుకుంటాం.గోదావరి నదిపై ప్రాజెక్టులను పూర్తి చేసుకుని ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసుకోవాలి. అనవసరమైన వివాదాలు, గందరగోళపరిచే విమర్శల వల్ల ప్రయోజనం లేదు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ విధానపరమైన లోపాలు, ఆలోచనల కారణంగానో ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గడిచిన పదేళ్లలో చిత్తశుద్ధితో ప్రాజెక్టులను పూర్తి చేసి 967 టీఎంసీల నీటిని వినియోగంలోకి తెచ్చుకుని ఉంటే, వరద జలాలపైనా, వాటా నీటిని తరలించడానికి అవకాశం ఉండే. 2001 లో మొదలైన దేవాదుల రెండు దశాబ్దాలు దాటినా ఇంకా సాగుతూనే ఉంది. ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పుడు నిధుల సమస్య వచ్చింది. రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండటం వల్ల అవసరమైన నిధులు విడుదల చేయాలంటే కొరత ఉంది. అందుకే సమీక్షించి వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇప్పటికే అంచనాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. ఈ విధానానికి ముగింపు పలకాలి. సవరించిన అంచనాలను సవరించి మంత్రివర్గం ఆమోదంతో పనులను వెంటనే పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం. తుమ్మిడి హెట్టి నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ప్రాజెక్టులపైన పూర్తి స్థాయి సమీక్ష చేసి వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తాం. కాళేశ్వరం నుంచి చుక్కనీటిని ఎత్తిపోయకుండానే తెలంగాణలో అత్యధిక దిగుబడి సాధించాం. గోదావరి, కృష్ణా జలాలపై పక్క రాష్ట్రానికి తరలించడానికి సహకరిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆరోపణలు సరికాదు. గోదావరి నదీ జలాలపై శాసనసభలో చర్చ చేద్దాం. సూచనలు ఇవ్వండి. చవకబారు ఆరోపణలతో ప్రయోజనం లేదు. తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీయొద్దు. ప్రతిపక్షం ఇచ్చే మంచి సూచనలను స్వీకరిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు తెలంగాణ ప్రజల ఆస్తి. గాలికి వదిలేయం. ప్రజలకు ఉపయోగపడేలా చేస్తాం. బ్యారేజీలకు సంబంధించి ఆనకట్టలకు సంబంధించి భూమి లోపల ఏమైనా సమస్యలున్నాయా అన్న కోణంలో కూడా విశ్లేషణలు జరగాలి. ఆ ప్రాజెక్టు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారకూడదన్న ఆలోచనతో ఉన్నాం. ఆ తర్వాత ఆ బ్యారేజీలను పునరుద్ధరిస్తాం.." అని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన మేడారం శ్రీ సమ్మక్క - సారలమ్మ మహాజాతర బ్రహ్మాండంగా సాగిందని అన్నారు. దక్షిణ కుంభమేళా తరహాలో జాతర జరిగిందని పేర్కొంటూ, మేడారం అభివృద్ధికి సంబంధించి భక్తులు నిరంతరం సందర్శించేలా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోసారి మేడారం సందర్శించి సమీక్షిస్తానని చెప్పారు.

## అట్టుడుకుతున్న కామారెడ్డి

సలహాదారు షబ్బీర్ అలీకి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సమయంలో వివాదం చిలికి చిలికి గాలివానగా మారి సవాళ్లు ప్రతిసవాళ్లు చేసుకునే దాకా వెళ్ళింది. అంతేకాదు కాంగ్రెస్ పార్టీకి చెందిన పోసానిపేట మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి తన కారుతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

**రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తుందా? భగ్గుమన్న బండి సంజయ్**

బిజెపి కార్యకర్తలు కారును ధ్వంసం చేశారు. పరిస్థితిని కంట్రోల్ చేయటానికి పోలీసులు మహేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకున్న నేపథ్యంలో ఎవరు కామారెడ్డికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఇక దీనిపైన కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తుందా ఆయన ప్రశ్నించారు. ప్రశ్నిస్తే కాంగ్రెస్ నేతలు దాడులు చేయడమేమిటి అంటూ నిలదీశారు. రాష్ట్రంలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు ప్రారంభమయ్యాయని, ఎంఐఎం తో కలిసి కాంగ్రెస్ అరాచకాలు సృష్టిస్తోందని బండి సంజయ్ అన్నారు. ఈ అరాచకాలను అడ్డుకోవడానికి బీజేపీ కార్యకర్తలు సిద్ధం అవ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో జరిగిన సంఘటనలను గుర్తుంచుకోవాలని, కాంగ్రెస్ ఎంఐఎం పార్టీలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం దారుణమని బండి సంజయ్ అన్నారు.

బిజెపి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇంటిపై దాడి అమానుషమని, కామారెడ్డిలో అగ్నికి ఆజ్యం పోసింది కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. ఆత్మరక్షణకు అడ్డుకుంటే దాడి చేశారని చెప్పడం సిగ్గుచేటన్నారు. బాన్సువాడలో 70 మందిని అరెస్ట్ చేయడం అక్రమమని, రాళ్ళ దాడి స్పష్టంగా కనిపిస్తున్న చర్యలు ఎందుకు లేవని బండి సంజయ్ ప్రశ్నించారు. బాన్సువాడ వెళ్లేందుకు ప్రయత్నం చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు అరెస్ట్ చేయడం అన్యాయమని ఆయన అన్నారు. ఎంఐఎం ను కాపాడడానికి కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్నారు.

## బాధితులకు అండగా నిలుస్తాం

ఆ నివాస భవనం వారికి ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ పేదల బతుకులను కూల్చవద్దని ఆయన హితవు పలికారు. కేసీఆర్‌కు మధు పార్క్ అపార్ట్‌మెంట్‌తో మర్చిపోలేని అనుబంధం ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌కు మూడుసార్లు వచ్చారని.. టీఆర్ఎస్ పార్టీ పాలసీ విజన్ డాక్యుమెంట్‌ను ఇక్కడి వార్ రూముల్లో కూర్చునే తయారు చేశారని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక.. ఇక్కడ మంచినీళ్లు లేక మీరు అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి వెళ్లిపోతామంటే, అప్పటికప్పుడు HMWS అధికారులను ఆదేశించి ప్రత్యేక పైపులైన్ వేశారని తెలిపారు. అప్పటి హోంమంత్రి నాయిని నరసింహారెడ్డితో బటన్ ఆన్ చేయించి మరీ మీకు నీళ్లు ఇచ్చారన్నారు.

ఈ అపార్ట్‌మెంట్ వారిని కాంగ్రెస్ సర్కార్ ఇబ్బంది పెట్టొద్దని ఈ సందర్భంగా హరీశ్ రావు కోరారు. పేదలకు అండగా ఉండాలని కేసీఆర్ తమను ఇక్కడకు పంపించారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పాలసీ డాక్యుమెంట్ కోసం కేసీఆర్ ఇక్కడి నుంచే ప్రణాళికలు సిద్ధం చేశారని ప్రస్తావించారు. కేసీఆర్ ఈ అపార్ట్‌మెంట్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారని.. రేవంత్ మాత్రం కూల్చేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా కేసీఆర్ పనిచేశారని చెప్పుకొచ్చారు. మూసీ మురికి పోవాలని బీఆర్ఎస్ ఎప్పుడో పని ప్రారంభించిందన్నారు. రూ. 4000 కోట్లతో ఎస్టీపీలను నిర్మించామని తెలిపారు. గోదావరి జలాలు మూసీకి తీసుకురావాలని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుందన్నారు. రేవంత్‌రెడ్డి ఏది చేసినా.. భూముల పంచాయతీ, రియల్ ఎస్టేట్ చేస్తారని ఆరోపించారు. మూసీ సుందరికీరణ పేరుతో పెద్ద కాంట్రాక్టర్లకు ఇచ్చేలా రేవంత్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే విమర్శించారు. అసెంబ్లీలో అపార్ట్‌మెంట్ వాసుల తరఫున తాము ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని హరీశ్ రావు పేర్కొన్నారు.

## ప్రతి మండలంలో స్వచ్ఛ రథం

"స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర" లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఆయన అన్నారు. నిన్న పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఇంటింటికీ చెత్త డబ్బాలు పంపిణీ చేసి, తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించినప్పటికీ, చాలా చోట్ల నిబంధనలు పాటించకపోవడం సమస్యగా మారింది. దీనికి పరిష్కారంగా 'చెత్తకు సంపద' పథకాన్ని ప్రారంభించారు చంద్రబాబు. చెత్త ఇస్తే సరుకులు ఈ పథకం కింద తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి అందించే వారికి ఉచితంగా కూరగాయలు, పప్పులు అందించనున్నారు. గుంటూరు జిల్లాలో ఈ విధానం ప్రయోగాత్మకంగా అమలవుతూ మంచి ఫలితాలు ఇస్తోంది. ఇంట్లో ఉపయోగంలో లేని వస్తువులను కూడా సేకరించి వాటి విలువకు అనుగుణంగా సరుకులు అందిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నమూనాను విస్తరిస్తోంది.

లక్ష్యం ఇదే ప్రతీ మండలంలో 'స్వచ్ఛ రథాలు' కేటాయించి చెత్త సేకరణ, రవాణాను మెరుగుపరచనున్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌ను నియమించి, ముఖ్యంగా గ్రామీణ మహిళలకు కార్యక్రమం ప్రయోజనాలు వివరించనున్నారు. తడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువుల ఉత్పత్తి సాధ్యమవుతుండగా, ప్రజలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా భాగస్వామ్యాన్ని పెంచే సమగ్ర విధానంతో రాష్ట్రాన్ని నిజమైన 'స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్'గా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# మిడ్ మానేర్ కెనాల్ లో తుంగను తొలగిస్తున్న రైతులు

జయభేరి, సైదాపూర్ :



గోదావరి ఉపనదైన మానేరుపై నిర్మించిన మిడ్ మానేర్ డ్యామ్ లో 25.873 టీఎంసీ (తౌసండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్)నీళ్లను నిల్వ చేసుకోవచ్చును.2025 అగస్ట్ నాటికి 15.636 టీఎంసీల నీరు నిల్వ ఉంది.లెఫ్ట్ సైడ్ కెనాల్ నుండి 14.60 కిలోమీటర్ల దూరం నీటిని ప్రవహింప చేసి 9,500 ఎకరాలకు,రైట్ సైడ్ కెనాల్ నుండి 75.140 కిలోమీటర్ల దూరం నీటిని ప్రవహింప చేసి 90,500 ఎకరాలకు సాగు పంటలకు నీళ్లను సరఫరా చేయాలి. 2025 అక్టోబర్ లో కురిసిన వర్షాలతో బొమ్మనపల్లి ఊర చెరువు మత్తడి నీళ్ల ప్రవాహంతో రైట్ సైడ్ కెనాల్ లో పూడిక నిండింది.అప్పటి నుండి 2026 ఫిబ్రవరి 19 వరకు కెనాల్ లో నీటి సరఫరాను నిలిపివేశారు. పూడిక తొలగింపు అనంతరం 20వ, తేది నుండి కెనాల్ లో నీళ్లు పారుతున్నవి. అయినప్పటికీ దుద్దెనపల్లి, రేకొండ, ఎగ్లాస్ పూర్ గ్రామ శివారుల పంటపొలాలకు నీళ్లు అందడం లేదు.

బొమ్మనపల్లి శివారు నుండి పారుతున్న ప్రధాన కాలువ 61.84 కిలోమీటర్ల దగ్గర నుండి ఉప కాలువ లోకి పోయేందుకు ఉన్న వాల్వు(తూము) దిగువన ఏపుగా పెరిగిన తుంగ నీళ్లను అడ్డగించుచున్నవి. ఈ ఉప కాలువ దాదాపు కిలోమీటరు ప్రవహించిన తరువాత దుద్దెనపల్లి పడాల చెరువు ఎగువన మరొక తూము ద్వారా దుద్దెనపల్లి, రేకొండ, ఎగ్లాస్ పూర్ శివారు, "నాగుల చెరువు" ఎగువ పంట పొలాలకు నీటి సరఫరా సాగుతుంది. ప్రధాన ఉప కాలువ దుద్దెనపల్లి, ఎగ్లాస్ పూర్ శివారు, "దేవుని చెరువు" ఎగువ పంట పొలాలకు నీటి సరఫరా సాగుతుంది. మెయిన్ కెనాల్ నుండి తూము ద్వారా వచ్చే నీటిని అడ్డగించుచున్న తుంగను,పిచ్చి జంగల్ ను ఎగ్లాస్ పూర్ రైతులు గంగిళ్ల నర్సింహారెడ్డి, తాడవేణి కార్తీక్, రమేశ్, మ్రి కొమురెల్లి, పరుశరాములు, పొన్నం తిరుపతి, రాజు, రాములు, శ్రీనివాస్, బొజ్జ కొండలు పారలు, కొడవళ్ళు, తట్టలతో ఉప కాలువ తూము నుండి అర కిలోమీటరు కాలువలో తుంగను,పిచ్చి జంగల్ అడ్డును శనివారం తొలగించి నీటిని ప్రవహింప చేసుకున్నారు. కాని కాలువ చివరి వరకు పిచ్చి జంగల్ ఉందని రైతులు వాపోవుచున్నారు.గత సంవత్సరం మార్చిలో కూడా కాలువలోని తుంగను మేమే తొలగించుకున్నామని రైతులు ఆవేదన చెందుచున్నారు.



మేరుగు రాజయ్య
దుద్దెనపల్లి, సైదాపూర్
9441 440 791

> **ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు.రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి.**

ఈ యాసంగి కాలానికి సైదాపూర్ మండలంలో ప్రవహించే మిడ్ మానేర్ కుడి కాలువ అత్యవసర పనుల గురించి రూ.3,79,908 లు ఖర్చు చేసినట్లుగా తెలుస్తుంది.అలాగే తెలంగాణ ఐ & సిఎడి (ఇరిగేషన్ &కమాండ్ ఏరియా డెవలప్ మెంట్) కింద టెండర్ రిఫరెన్స్ నంబర్ 13471619, పత్రం నిట్ నంబర్ 04/202526, రూ 1,29,650 కేటాయించినట్లుగా తెలుస్తుంది. ఇలా లక్షల రూపాయలు వెచ్చించినప్పటికీ రైతుల సాగునీరుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాజెక్ట్ నీరు సక్రమంగా పంట పొలాలు పారడానికి చర్యలు తీసుకోవలసిన బాధ్యత నీటి పారుదల శాఖపై ఉంది. ఇన్ టేక్ కెనాల్స్, ట్రాప్ పిట్స్, సర్జ్ పూల్ నుండి పేరుకు పోయిన సిల్ట్ ను తొలగించాలి. ఇంకా పంపు గృహాలు, కాంక్రీట్ ప్యాచ్ వర్క్, క్లీనింగ్, క్లియరింగ్, శిథిలాలు, అడ్డంకులు, అవాంఛితిత వృక్ష సంపదను క్రమంగా తొలగించాలి. ప్రతి ఆరు నెలలకు మార్చి, అక్టోబర్ నెలలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు కెనాల్స్ ను తనిఖీ చేయాలి. వార్షికంగా మే, నవంబర్ నెలలో సూపరింటెండెంట్ ఇంజనీర్ తనిఖీ చేయాలని నిబంధనలు ఉన్నవి. నియోజక వర్గ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పంట పొలాల సాగునీరు అవశ్యకతను గుర్తెరిగి రైతులకు అండగా ఉండాలి. రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వ యంత్రాంగానికి సూచనలు ఇస్తూ పురమాయించాలి. హుస్నాబాద్ నియోజకవర్గంలోని సైదాపూర్ మండలంలో పారుతున్న మిడ్ మానేర్ డ్యామ్ కుడి ప్రధాన కాలువ, ఉప కాలువలలోని సిల్ట్ ను, పిచ్చి జంగల్ ను తొలగింప చేసి యాసంగి పంటలకు సాగు నీరందించాలని రైతులు కోరుచున్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు

- నేడు గోవర్ధనగిరిధారిగా, సింహవాహనంపై స్వామివారి దర్శనం

జయభేరి, యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 22:



మురళీని చేతబూని వేణుగానం ఆలపిస్తున్నట్లుగా శ్రీనారసింహుడు మురళీ లోలుడిగా భక్తులను కనువిందు చేశారు. శ్రీపంచ నారసింహ క్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు ఆదివారం ఉదయం శ్రీకృష్ణాలంకారము (మురళీకృష్ణుడు)గా, సాయంత్రం పొన్నవాహన సేవలో భక్తులకు సాక్షాత్కరించారు. శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చక బృందం, పారాయణీకులు స్వామి వారికి వజ్ర వైఢూర్యాలు ధరించి, మురళీని చేతబూని వేణుగానం ఆలపిస్తున్నట్లుగా శ్రీకృష్ణావతారంలో చూడముచ్చటగా అలంకరించి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆస్థాన మండపంలో వేంచింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో నిత్యారాధనల అనంతరం స్వామివారిని పొన్నవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగిస్తూ భక్తులను అనుగ్రహించగా దర్శించుకొని తరించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణాలంకారము (మురళీకృష్ణుడు) అలంకారం, పొన్నవాహన సేవ అవతార విశిష్టతను ఆలయ అర్చకులు భక్తులకు వివరించారు. పూజా వేడుకల్లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహ్మమూర్తి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్, ప్రధానార్చకులు కాదూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యులు, ఉపప్రధానార్చకులు నర్సింహ్మమూర్తి, మాధవాచార్యులు, మణికంఠ శ్రీధర్, లక్ష్మణాచార్యులు, వేదపండితులు శ్రీనివాసశర్మ, శ్రీవాస్తవ శర్మ, అర్చకులు కిరణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్‌శర్మ, ఆలయ అధికారులు రఘు, రాజన్‌బాబు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాలంకారం (మురళీకృష్ణుడు) బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీనారసింహుడు శ్రీకృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భగవానుని దశావతారములలో శ్రీకృష్ణ అవతారము ఎన్నో విశేషములతో కూడుకున్నదని, శ్రీకృష్ణ భగవానుడు మురళీకృష్ణుడిగా (వేణుగోపాలస్వామి) జగత్ ప్రసిద్ధి చెందిన తత్త్వమని అర్చకులు వివరించారు. వేణునాదము వేదనాదమని వైకుంఠంలోని తత్త్వం కంటే ఆనందకరమైందని, భగవానుడు బృందావనంలో వినిపించే వేణునాదం అన్ని లోకాలను మైమరపింప చేస్తుందని తెలిపారు. సామాన్యులు మొదలుకొని బ్రహ్మాది దేవతలను సమ్మోహన పరచిన ఈ వేణువు యొక్క వృత్తాంతమును స్మరిస్తే సర్వస్వము త్యజించి భగవానుని శరణు వేడిన తీరు ముక్తి ప్రదమని స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. వేణుగానం వినడం, మురళీకృష్ణుడిని దర్శించడం కన్నులకు,చెవులతో పాటు ఇంద్రియములన్నింటికీ ఎంతో ఉపశమనమని తెలిపారు.

**పొన్నవాహన సేవ...**

దేవతా వృక్షముగా ప్రసిద్ధి పొందిన వృక్ష రాజములలో అత్యంత శ్రేష్టమైనది పొన్నవృక్షమని, భగవానుడికి కూడా నిత్య నివాస స్థానముగా ప్రసిద్ధి పొందిందని అర్చకులు వివరించారు. భగవానుడు సత్పురుషులకు నివాస వృక్షముగా ఉండునని పొన్నవాహన సేవలోని అంతరార్థమని తలిపారు.

**అలరించిన ధార్మిక,సంగీత మహాసభలు..**

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ధార్మిక, సంగీత మహాసభలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీవైష్ణవ సేవా సమాఖ్య వారిచే విష్ణుసహస్రనామ పారాయణం, బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావుచే నవనారసింహ తత్త్వంపై ఉపన్యాసం, యాదగిరి క్షేత్ర వైభవం, యడవల్లి శ్రీనివాస భగవతార్‌చే గజేంద్ర మోక్షంపై హరికథా గానం ఎంతో ఆకట్టుకుంది.

అంతేకాకుండా భజన, మంగళవాయిద్యం, వైదిక ప్రార్థన, హరికథ, కూచిపూడి, కర్ణాటక సంగీతం, భక్తి సంగీతం, వయోలిన్, భరతనాట్య ప్రదర్శనలు భక్తులకు ఎంతో అలరించాయి.

**ఉచిత వైద్యశిబిరం..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొండపైన ప్రధాన కార్యాలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు, స్థానికులు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకుంటున్నారు.

**శ్రీవారి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి నిత్యరాబడిలో భాగంగా వివిధ శాఖల నుండి రూ.39,86,971 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**ఉత్సవాల్లో నేడు..**

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు ఉదయం గోవర్ధనగిరిధారి అలంకారం, రాత్రి సింహ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవా లాల్

- ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలి

జయభేరి, దేవరకొండ :




గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ కొనియాడారు. హైదరాబాద్ గుర్రంగూడలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ మహనీయుడి అడుగుజాడల్లో పయనించాలని పిలుపునిచ్చారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్ మహారాజ్ అంటూ అభివర్ణించారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల ఆరాధ్యదైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించిందని గుర్తు చేశారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించి గిరిజనులకు రాజ్యాధికారంలో కీలక భాగస్వామ్యం చేసిన ఘనత కేసీఆర్ దేనని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో బంజారాహిల్స్‌గా పిలుచుకుంటున్న ప్రాంతంలో మూడు శతాబ్దాల క్రితమే సేవాలాల్ మహారాజ్ నడయాడారని, అదే బంజారాహిల్స్ నేలమీద వారి పేరుతో నిర్మించిన భవన్‌లో బీఆర్ఎస్ సర్కార్ అధికారికంగా నిర్వహించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవిస్తే అణగారిన వర్గాల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి తగిన గుర్తింపు దక్కుతుందనడానికి వారి జయంతి ఉత్సవాల నిర్వహణ మరో ఉదాహరణగా నిలిచిందని పేర్కొన్నారు. అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటానికి సేవాలాల్ మహారాజ్ చేసిన కృషిగొప్పదని వెల్లడించారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షించుకొనే దిశగా సంత్ సేవాలాల్ జీవితాంతం పోరాటం సాగించారని పేర్కొన్నారు. ఆ దిశగా వారు కల్పించిన చైతన్యం, వారు చేపట్టిన కార్యాచరణ దేశవ్యాప్తంగా ఉన్న లంబాడా/బంజారాలకు రక్షణ కవచంగా నిలిచిందని వివరించారు. బంజారాలకు స్ఫూర్తి ప్రదాతగా నాటి కాలంలో వారు చేసిన కృషి, విశ్వవ్యాప్తంగా ఉన్న బంజారాలకు వారిని ఆధ్యాత్మిక గురువుగా, తమ ఆరాధ్య దైవంలా కొలిచేలా చేసిందని గుర్తు చేశారు. గిరిజన బిడ్డల ఆత్మగౌరవం పరిఢవిల్లేలా వారి ప్రతిభను చాటేందుకు, ఉద్యోగ, ఉపాధి, విద్య, క్రీడలు తదితర రంగాల్లో బీఆర్ఎస్ సర్కారు అనేక కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున, అత్యంత ఖరీదైన ప్రాంతంలో సంత్ సేవాలాల్ మహారాజ్ పేరుతోనే బంజారా భవన్‌ను వారి ఆత్మగౌరవం ఉట్టిపడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందని తెలిపారు. ఇందులో సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపన చేసిందన్నారు. గిరిజనులంతా ఐకమత్యంతో మెలిగి పార్టీలకు అతీతంగా కృషి, పట్టుదలతో పరస్పర సమన్వయంతోపనిచేసి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్గానిక్ పద్ధతిలో పంటలను పండించాలి

జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 22 :

రైతులు ఆర్గానిక్ పద్ధతుల్లో పంటలను పండించాలని సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ అన్నారు. ఆదివారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో భువనగిరి ఎస్ ఎల్ ఎన్ ఎస్ డిగ్రీ కళాశాల నుండి వచ్చిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా యూనిట్ 2 విద్యార్థులు గ్రామంలోని ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్గానిక్ పద్ధతుల్లో చేస్తున్న మునగ ఆకు ఉత్పత్తుల గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ యొక్క ప్రాసెసింగ్ సెంటర్ గురించి సమస్త డైరెక్టర్ సుధీర్, అమరేందర్ రెడ్డి, సుమలత, అరుణ లు వివరిస్తూ సోలార్ డిహైడ్రేషన్డ్ మునుగ, తులసి, అశ్వగంధ, అల్లం, బొప్పాయి మొదలగు ఇతర ఆకులని ఎండబెట్టి ప్యాకింగ్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో రైతులను భాగస్వాములు చేసి వారిని ఆర్గానిక్ పద్ధతుల్లో పంటలను వేయించి వాటికి తిరిగి కొనేలాగా వారిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. దీని ద్వారా వారికి మంచి ఆదాయం వస్తుందని భూమి ఆరోగ్యాన్ని కాపాడవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ కనక బాలరాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 22 :

తుర్కపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన పల్లెపాటి బిక్షపతి ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మి నరసయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లూరి వెంకట నరసింహారెడ్డి, కల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొడపాక పాపయ్య, వేముల లక్ష్మయ్య ,పల్లెపాటి రేణు కుమార్, పెద్దల రాజు, గుంటి శివ, వేముల మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఒక్క సెలవు కూడా పెట్టని

- ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామలింగాచారికి ఎంఈఓ చందా రమేష్ సత్కారం

జయభేరి, యాదగిరిగుట్ట :



బడిలో ఉపాధ్యాయుడిగా చేరి 300 రోజులు గడుస్తున్న ఏ ఒక్క రోజు కూడా సెలవు పెట్టని టీచర్ ను సన్మానించిన సంఘటన ఆలేరు నియోజకవర్గంలోని రాజపేట మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. రాజాపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా కొనసాగుతున్న వనమాల రామలింగాచారిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మనోజ్ కుమార్ ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు. 2024 సంవత్సరం అక్టోబర్ 16వ తేదీన ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరిన రామలింగాచారి రాజపేట లోని ప్రాథమిక పాఠశాలలో జాయిన్ అయ్యారు. ఉపాధ్యాయునిగా విద్యార్థులకు చక్కటి బోధన చేస్తూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం లక్ష్యసాధన దిశగా అడుగులు వేస్తూ... ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న రామలింగ చారి విద్యా బోధన ప్రత్యేకంగా మారింది. దీంతోపాటు ఉద్యోగంలో చేరి 300 రోజులు దాటగా ఇప్పటి వరకు ఒక్క సెలవు కూడా తీసు కోకపోవడం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో ఎంఈఓ చందా రమేష్ వనమాల రామలింగా చారిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రత్యేక కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మనోజ్ కుమార్ తోటి ఉపాధ్యాయ బృందం సమక్షంలో రామలింగ చారిని ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. రాజపేట మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం, హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల భాస్కర్, రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్, రాజపేట సర్పంచ్ కోయ మధు, అన్ని పార్టీల నాయకులు యువకులు రామలింగాచారిని అభినందించి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.



## ఘనంగా వెంకటేశ్వర స్వామి శేష వాహన సేవ

- సాంప్రదాయ రీతిలో స్వామివారి ఊరేగింపు
- అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారు


జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి శేష వాహన సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారి తిరుచి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అయితే విశేష దినోత్సవం సందర్భంగా స్వామివారి శేష వాహన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన శేష వాహనంపై స్వామివారిని గర్భగుడి నుండి దేవస్థానం నందు ఉన్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అక్కడ దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అశేష జనావళి తిలకిస్తుండగా ఈ పవిత్ర పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ పూజా కార్యక్రమాలను కూడా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని రకరకాల ఆభరణాలు, పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారి లతోపాటు దేవస్థానం పాలకమండలి సభ్యులు, పూజారులు, సిబ్బంది, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర మహోత్సవాలు

- సోమవారం స్వామి కల్యాణం
- వేడుకలకు హాజరు కావాలని ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం



జయభేరి, శామీర్ పేట్, ఫిబ్రవరి 22:

శామీర్ పేట మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు ఆలయానికి విచ్చేసి పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ జాతర వేడుకల్లో భాగంగా సోమవారం మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ సిబ్బంది వెల్లడించారు. కాగా ఈ కళ్యాణ మహోత్సవానికి హాజరు కావాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కి శామీర్ పేట సహకార సంఘం వైస్ చైర్మన్ మ్యాకల ఐలయ్య ఆహ్వాన పత్రిక అందచేశారు. దీనిపై ఎమ్మెల్యే మల్లారెడ్డి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట బిఆర్ ఎస్ పార్టీ నాయకులు వంగ వెంకట్ రెడ్డి, పవన్ ముదిరాజ్,బాబు,బుర్క వెంకటేష్, ఎడ్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాం

- మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కళ్యాణ్ కర్ పద్మాబాయి నర్సింగరావు
- వైస్ చైర్ పర్సన్ దంపతులకు మిత్రుల ఘన సన్మానం

జయభేరి, గజ్వేల్, 22 ఫిబ్రవరి :




సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన కళ్యాణ్ కర్ పద్మాబాయి, నర్సింగరావు దంపతులను ఆదివారం వారి మిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ చైర్ పర్సన్ పద్మాబాయి నర్సింగరావు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకులు, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు ఆశీస్సులతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ప్రజలు, ముఖ్యంగా 17వ వార్డు ఓటర్ల దీవెనలతో భారీ మెజారిటీతో గెలిచినందుకు వారు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

తమపై నమ్మకంతో వైస్ చైర్ పర్సన్‌గా అవకాశం కల్పించిన మాజీ మంత్రి హరీష్ రావుకు వారు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రజలకు 24 గంటల పాటు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించే దిశగా నిరంతరం పని చేస్తామని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్‌లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేసిన వారు తెలంగాణ రాష్ట్రంలోనే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని ముందంజలో ఉంచే విధంగా పని చేస్తామన్నారు. ఈ సంతోషకరమైన సమయంలో తమను ప్రత్యేకంగా సన్మానించిన మిత్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రులు అమరేందర్ రావు, వెంకట్ రెడ్డి, రవి సురేందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి పాలనలో బహుజనులకు రక్షణ కరువు...!

- పాలన చేతకాకుంటే ముఖ్యమంత్రి రాజీనామ చేయాలి.
- బీసీ పసి బిడ్డ ప్రాణాలు తీసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి.



జయభేరి, ములుగు, ఫిబ్రవరి :

రేవంత్ రెడ్డి పాలనలో బహుజనులకు రక్షణ కరువు అయింది. అన్ని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) ములుగు జిల్లా ఇంచార్జ్ పసులాది ముఖేష్ విమర్శించారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మూడు నెలల బీసీ (చాకలి )బిడ్డ ప్రాణాలు బలిగొన్న ఆధిపత్య వర్గాల వ్యక్తులను కఠినంగా శిక్షించాలిలి రాష్ట్రాన్ని పాలించడం రేవంత్ రెడ్డికి చేతకాకుంటే తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.హోమ్ శాఖను తన వద్దే పెట్టుకొని పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డికి రాష్ట్రంలో బహుజన కులాల వ్యక్తుల పై దాడులు,దౌర్జన్యాలు జరుగుతుంటే ఏం చేస్తున్నాడని ప్రశ్నించారు.బాధిత కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయం చేసి రక్షణ కల్పించాలన్నారు.రాబోయే రోజుల్లో బహుజన సమాజం ఏకమై దొరల పాలనను అంతమొందఇస్తుంది.

# ఎమ్మెల్యేకు గజమాలతో ఘన సన్మానం

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కు ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ యూత్ నాయకులు దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డిలతో పాటు సయ్యద్ జకి, నవీన్ గౌడ్, మున్నూరు నాని, రఘు, వంశీకృష్ణ, రాహుల్ సింగ్, కేశవులు, బోయ విజయ్, విజయ్, జగన్ చారి, డీజే చింటూ, కెంగూరి శివ, బీసు శివ, బండ విజయ్, డిజె శ్రీను, నాగరాజు, బాలరాజు, రేకులంపల్లి శ్రవణ్, అక్షయ్, వేణు, అమూల్యా నాయక్, నరేష్ నాయక్, వెంకటేష్, హాజీ, టైలర్ హాజీ, కురుమూర్తి, గౌస్, పర్శనాయక్, జంగం వెంకటేష్, నరహరి నాయక్, సచిన్ నాయక్, బన్నీ, వినయ్ కుమార్, జానీ, ఆవేజ్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యం ఏర్పడితేనే బహుజన బిడ్డలకు రక్షణ ఉంటుంది

- కుల అహంకారంతో దాడులు జరిపి పాప మరణానికి కారకులైన శ్రీనివాస్ రెడ్డి ముఠాపై కఠినమైన చర్యలు తీసుకోవాలి
- ఆదిపత్యకుల భావజాలం కలిగిన పార్టీలకు పదేపదే అధికారం ఇస్తే బహుజనులపై జరిగే అమానుష ఘటనలకు నిలువెత్తు సాక్ష్యంమే ఈ దాడి

జయభేరి, భద్రాచలం, ఫిబ్రవరి 22 :



నాగర్ కర్నూల్ మల్లన్న జాతరలో జరిగిన గొడవలో కులం అహంకార ధోరణిగల రెడ్లు రజక కుటుంబానికి చెందిన ఒక కుటుంబం పై దాడి చేసారు ఆ దాడి కారణంగా రెండు నెలల పాప మరణించింది కుల అహంకారంతో రెడ్లు రజకుల పై జరిపిన ఈ అమానుష దాడిని బిఎస్పి తీవ్రంగా ఖండిస్తుందని బీఎస్పీ భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షులు కొండా చరణ్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.
ఈ ఘటనలో పాలుపంచుకున్న అందరిని రిమాండ్ చేయాలని కుల అహంకారంతో దాడి చేసి పాప మరణానికి కారణమైన శ్రీనివాసరెడ్డి ముఠాపై మర్డర్ కేసు నమోదు చేసి కఠినమైన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉండాల్సిన పోలీస్ యంత్రాంగం రెడ్లకు అనుకూలంగా ఉండటం దుర్మార్గమని మండిపడ్డారు రాజకీయ ఒత్తిళ్లకు తలవంచి ఘటనకు ఘటనకు కారణమైన నిందితులను ఏ ఒక్కరిని కూడా తప్పించే ప్రయత్నం చేయడానికి వీలులేదని కేసును నీరు గారిచే పని చేస్తే బహుజన సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు రేవంత్ రెడ్డి ఈ ఘటనపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు ఆదిపత్యకుల భావజాలం కలిగిన పార్టీలకు పదేపదే అధికారం ఇస్తే బహుజనులపై జరిగే అమానుష దాడులకు నిలువెత్తు సాక్ష్యం ఈ నాగర్ కర్నూల్ లో రజకులపై జరిగిన దాడి అని తెలిపారు ఇప్పటికైనా బహుజన సమాజం మేల్కొనాలని ఈ ఘటనలు రజకులతో ఆగేవి కాదని మిగిలిన బహుజన కులాల దాకా తప్పకుండా వస్తుందని అన్నారు బహుజన బిడ్డల రక్షణ కోసం బహుజన రాజ్యం ఏర్పాటు కోసం ఐక్యంగా ఉద్యమించాలని యావత్తు బహుజన సమాజానికి పిలుపునిచ్చారు.



## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం, దమగ్నాపూర్ లో ఆదివారం జరిగిన అయ్యప్ప, గొల్ల గోవిందు, గొల్ల చంద్రన్న, వడ్ల కృష్ణయ్యల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల యజమానులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి నూతన వస్త్రాలు అందజేశారు.

## బండోని గూడలో ఘనంగా మల్లన్న బోనాల ఉత్సవాలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి



జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 23 :

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం బండోని గూడ గ్రామంలో మల్లన్నస్వామి బోనాల ఉత్సవాలలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆ భగవంతుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో విరసిల్లాలని అన్నారు. భగవంతుని అండదండలతో ఆర్థికంగా ప్రజలు అన్ని రంగాలలో ఉన్నత స్థాయికి ఎదగాలని భగవంతుని ప్రార్థించారు. గ్రామానికి అభివృద్ధి పనులలో తన వంతు సహాయ సహకారాలు కచ్చితంగా అందిస్తానని అభివృద్ధి పనులలో తమ చెయ్యి ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ విట్టల్,మామిడిపల్లి మాజీ ఎంపిటిసి కాట్న రవీందర్,వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు, నాయకులు బంటారం మల్లేష్ గౌడ్ సమూలయ్య,జలగూడెం శ్రీశైలం ,బండ అశోక్,బండ శ్రీను,బండ మల్లేష్,జెట్ట మహేందర్,ఇంటెనుక శ్రీశైలం,రత్నం,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


## సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



జయభేరి, చింతపల్లి :


మత సామరస్యానికి ప్రతీక సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గా అని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలోని సయ్యద్ హజ్రత్ అబాస్ దర్గాలో వారు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ 57వ ఉరుసు కార్యక్రమంలో మాజీ మంత్రి



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండలంలోని పీకే మల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన హజ్రత్ అబ్బాస్ దర్గా షరీఫ్ 57వ ఉరుసు కార్యక్రమంలో పాల్గొని, దర్గాను దర్శించుకొని,గంధాన్ని సమర్పించిన సూర్యాపేట శాసన సభ్యులు మాజీ మంత్రి వర్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్,BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్, బిలియా నాయక్, కిషన్ నాయక్, కంకణాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేటర్ కు ఘన సన్మానం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపొందిన హైదరాబాద్ డివిజన్ కార్పొరేటర్ లలిత భానుచందర్ ను ఆదివారం ఘనంగా సన్మానించారు. జనతా సేవా సమితి కార్యదర్శి విడిఎస్.రాజు, పూర్వపు వీఎన్ఆర్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు,యాజమాన్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కృష్ణ గార్డెన్ లో ఆదివారం జరిగిన అనుప, శ్రీనివాసులు దంపతుల కుమారుడి వివాహ కార్యక్రమానికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు.

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో ఉన్న ఓం కన్వెన్షన్ హాల్ లో ఆదివారం జరిగిన కోయిలకొండ మాజీ జడ్పిటిసి విద్యాసాగర్ మనవరాలి మొదటి పుట్టినరోజు వేడుకల్లో జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆ చిన్నారిని ఆశీర్వదించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన వెంకటయ్య పల్లి సర్పంచ్



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి లో ఇటీవల ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ పింజరి మోహన్ లు ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారితోపాటు వార్డ్ సభ్యులు బండి రమేష్, కుమ్మరి మణెమ్మ, సక్కెర బాలమ్మ గారు, బుడగ జంగం రంగయ్య, కావలి చంద్రకళ, పింజారి మల్లికార్జున్ మరియు గ్రామ నాయకులు సేవకుల నారాయణ, గోవర్ధన్ రెడ్డి, కొత్త ఉప్పరి ఆంజనేయులు, పెద్ద కాశన్న, కురువ సంఘం అధ్యక్షులు శివ, పెద్ద కురువ రాములు, మాజీ ఉపసర్పంచ్ చంద్రమ్మ యాదయ్య, మామిళ్ళ నరేష్, కుమ్మరి కిషోర్ లతో పాటు పెద్ద ఎత్తున మహిళలు, యువకులు కూడా ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదవారి సొంతింటి కల నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ రాష్ట నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్
- ఉప్పర్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న నేతలు

జయభేరి, శామీర్ పేట్:



కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పని మడమ తిప్పని ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి లు అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఉప్పర్ పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో లబ్ధిదారులు గృహ ప్రవేశం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వారికి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. గృహ ప్రవేశం అనంతరం పూజలు నిర్వహించిన అనంతరం అతిథులను సన్మానించారు. ఇందిరమ్మ ఇళ్లు పూర్తి కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు , ఇందిరమ్మ కమిటీ సభ్యులు బొల్లబోయిన నాగమణి, సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, గురిజాల బాబు, ఎలకుర్తి భాను చందర్, బాణాల భూపాల్ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూమిలో ఇరు వర్గాలకు సమాన హక్కులుంటాయి

- కనకదుర్గమ్మ, పోలేరమ్మ, నాంచారమ్మ గుడిలను చూపుతున్న ముదిరాజులు

జయభేరి, గజ్వేల్ ఫిబ్రవరి 22 :




సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్పల్లి గ్రామంలో ఖాతా 5022 సర్వే నెంబర్ 56/12/2 లో దేవాలయంకు సంబంధించి 2 ఎకరాల 20 గుంటల భూమి ప్రభుత్వం కేటాయిచిది. దాంట్లో గౌడ సంఘం నాయకులు ఎల్లమ్మ గుడి నిర్మించుకున్నారని మిగిలిన భూమిని దుర్గమ్మ గుడి కోసం కేటాయించారని ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ఇప్పుడు దుర్గమ్మ గుడి కట్టడానికి స్థలం చదును చేయగా ఒక పెద్ద ఈత చెట్టు, 5 చిన్న ఈత చెట్లు విరిగిపోయాయాని తెలిపారు. గత బిఆరెస్ ప్రభుత్వంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఈ స్థలంలో ఈత మొక్కలు నట్టిన మా గ్రామస్తులే కదా అని ఊరుకున్నమని ఇప్పుడు భూమి మొత్తం గౌడ కులస్తులకే చెదుతుందని చెప్పడం కరెక్ట్ కాదన్నారు. ఈ భూమిలో తమ తాతముత్తాతల నుండి కనకదుర్గమ్మ, పోలేరమ్మ, నాచరమ్మ గుడిలకు పూజలు చేస్తునమని చెప్పారు. ఇన్ని రోజులు అన్నదమ్ముల వలె కలిసి ఉన్నామని ఇప్పుడు దుర్గమ్మ గుడి కడదామంటే భూమి కోల్పోతాము అనే సాకు తో అనేక అబద్ధాలు చెబుతున్నారని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈత చెట్ల పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. దీనిపై మండల రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని ముదిరాజులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో లింగ మల్లయ్య, కల్వకుంట్ల బిక్షపతి, గుంటుక మహేష్, లింగ పాండు, చంద్రం, సురేష్, గుంటుక శంకర్, స్వామి, బాలరాజ్, తలారి స్వామి, రాము, శ్రీను, యాదగిరి, ఆంజనేయులు, సుధాకర్, రవి, గణేష్ పాల్గొన్నారు.


## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ యూత్ నాయకులు

- పార్టీ కండువా కప్పి స్వాగతం పలికిన ఎమ్మెల్యే జిఎంఆర్

జయభేరి, దేవరకద్ర :



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ యూత్ నాయకులు అన్నారు. దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు చేరారు నాయకులు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడారు. ఎమ్మెల్యే జిఎంఆర్ చేస్తున్న అభివృద్ధి పనులకు తామంతా బాగా ఆకర్షితుల య్యామన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో తామంతా చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా దేవరకద్ర మున్సిపాలిటీకి చెందిన బిఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జకీ, మరియు బిఆర్ఎస్ యువ నాయకులు నవీన్ గౌడ్, మున్నూరు నాని, రఘు, వంశీకృష్ణ, రాహుల్ సింగ్, కేశవులు, బోయ విజయ్, విజయ్, జగన్ చారి, డీజే చింటూ, కెంగూరి శివ, బీసు శివ, బండ విజయ్, డిజె శ్రీను, నాగరాజు, బాలరాజు, రేకులంపల్లి శ్రవణ్, అక్షయ్, వేణు, అమూల్నాయక్, నరేష్ నాయక్, వెంకటేష్, హాజీ, టైలర్ హాజీ, కురుమూర్తి, గౌస్, పర్శనాయక్, జంగం వెంకటేష్, నరహరి నాయక్, సచిన్ నాయక్, బన్నీ, వినయ్ కుమార్, జానీ, ఆవేజ్, షోయబ్ తదితరులు మరియు వివిధ గ్రామాల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారందరికీ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ప్రజల కష్టసుఖాలలో భాగస్వాములు కావడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## మెడ ముట్టుకుంటే.. తొడగొట్టినట్టే..

'పవర్‌స్టార్ ఇమేజ్‌కి తగ్గట్టుగా పాట ఉండాలని.. దానికి ఆస్కార్ పెన్నే కరెక్ట్ అని చంద్రబోస్‌ని కలిశాను. పవన్‌కల్యాణ్‌పై అభిమానంతో.. ఆయన జీవన శైలిపై అవగాహనతో.. పవన్‌కల్యాణ్‌కి మాత్రమే సెట్ అయ్యేలా చంద్రబోస్ ఈ పాట రాశారు. 'మెత్తని మట్టిలో మొలిసిన మొలకవు కాదోయ్ నువ్వు.. బండరాళ్లను బద్దలు కొట్టిన మొండి మొక్కవు నువ్వు..' అనేది ఈ పాటలో నాకిష్టమైన లైన్. యేటికి ఎదురీదడం అంటే ఎప్పుడూ పవన్‌కల్యాణ్ ముందుంటారు. ఆయన ప్రయాణమంతా ఈ పాటలో ఉండేలా ప్రయత్నించాం. ఈ పాటకోసం దేవిశ్రీ, చంద్రబోస్ ప్రాణం పెట్టారు. పవన్ స్వాగ్, పవన్ పవర్ ఈ సినిమాలో చూస్తారు' అని హరీశ్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠంలో 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌ని విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో దర్శకుడు హరీశ్‌శంకర్ పై విధంగా స్పందించారు. పవన్‌కల్యాణ్ కెరీర్లో నిలిచిపోయేలా ఈ పాట ఉంటుందని, పవర్‌స్టార్ సినిమాకు సంగీతం అందించడంలో ఓ కిక్ ఉంటుందని సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ అన్నారు. 'మెడ ముట్టుకుంటే.. తొడగొట్టినట్టే.. జుట్టెగురుతుంటే.. ఇక దడదడ పిడుగులు పడినట్టే..' అంటూ సాగే ఈ పాట పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాన్ని ఎలివేట్ చేసేలా సాగింది. ఇంకా ఈ కార్యక్రమంలో గీత రచయిత చంద్రబోస్, దర్శకుడు దశరథ్ కూడా పాల్గొన్నారు.

## నిరాశపర్చిన రాజాసాబ్..



గ్లోబర్ స్టార్ యాక్టర్ ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్ 2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.



## కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్..

ఆమె మొదటి రెండు మూడు చిత్రాలతోనే బాలీవుడ్ ఇండస్ట్రీలో గ్లామర్ క్వీన్ గా నిలిచింది. హిందీలో వరుస సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ గా నిలిచింది. అలాగే తెలుగులోనూ పలు చిత్రాల్లో నటించి మెప్పించింది. 2014లో న్యాచురల్ స్టార్ నాని జోడిగా ఆహా కళ్యాణం సినిమాలో నటించింది. తెలుగులోనూ మంచి పాపులారిటి వచ్చినప్పటికీ ఈ బ్యూటీకి ఆశించిన స్థాయిలో ఆఫర్స్ రాలేదు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిత్యం గ్లామరస్ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. అయితే హిందీలో ఎక్కువ సినిమాలు చేస్తున్న ఆమెకు ఇటీవల ఒక ఎదురుదెబ్బ తగిలింది. వాణి కపూర్ నటించిన మూడు సినిమాలు ఆగిపోయాయి. ఆమె నటిస్తున్న సర్వకున్ సంపన్ సినిమా షూటింగ్ 2023లో ఆగిపోయింది. అలాగే అపరశక్తి ఖురానా, పరేష్ రావల్, వాణి కపూర్ నటించిన పథమీస్ కిల్ సినిమా 20224 నవంబర్ లో విడుదల కావాల్సి ఉంది. ఈ సినిమాను కొనుగోలు చేయడానికి సరైన పంపిణీదారులు కనిపించలేదు. అసాదే అబీర్ గులాల్ అనే సినిమాను ఫవాద్ ఖాన్ సరసన నటించింది. 2025 ఏప్రిల్ లో పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత పాకిస్తానీ కళాకారులపై నిరసనలు రావడంతో ఈసినిమాను ఇండియాలో బ్యాన్ చేశారు.

## అతనికి 29, ఆమెకు 53 ఏళ్లు..!



ప్రస్తుతం ఓటీటీలో సినిమాలు దుమ్మురేపుతున్నాయి.కొత్త సినిమాలతో పాటు డబ్బింగ్ సినిమాలు కూడా ఓటీటీల్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఓటీటీలో రిలీజ్ అవుతున్న సినిమాల్లో థ్రిల్లర్, హారర్, రొమాంటిక్, లవ్ స్టోరీ సినిమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కాగా ఇప్పుడు ఓ సినిమా ఓటీటీలో ఆకట్టుకుంటుంది. ఇది ఒక ప్రేమ కథ. కానీ చాలా డిఫరెంట్ కథతో తెరకెక్కింది ఈ సినిమా. కాగా తెరపై తమకంటే చాలా చిన్న వయసు ఉన్న హీరోయిన్లతో ప్రేమలో పడుతుంటారు. కానీ ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న సినిమా మాత్రం పూర్తిగా డిఫరెంట్. 29 ఏళ్ల కుర్రాడు.. 53 ఏళ్ల హీరోయిన్ తో ప్రేమలో పడడం.. ఆ తర్వాత ఇద్దరి జీవితాలు ఎలా మారాయి. తనకంటే దాదాపు 24 సంవత్సరాలు పెద్ద వయసు ఉన్న నటితో హీరో ప్రేమలో పడడం.. వారిద్దరి జీవితంలో ఊహించని పరిస్థితులు ఎదురైనప్పుడు ఏం జరిగింది అనేది సినిమాలోనే చూడాలి. బాలీవుడ్ యంగ్ హీరో ఇషాన్ ఖట్టర్.. దఢక్ సినిమాతో జాన్వీ కపూర్ తో కలిసి హీరోగా తెరంగేట్రం చేశారు. ఆ తర్వాత మ్యాన్ ఆఫ్ ది అవర్, ది రాయల్స్, హోమ్ బౌండ్, బియాండ్ ది క్లౌడ్స్ వంటి సూపర్ హిట్ చిత్రాలతో మరింత ఫేమస్ అ్యయారు. సినిమాలతోపాటు అటు ఓటీటీలో వెబ్ సిరీస్ సైతం చేస్తున్నారు. ఎ సూటిబుల్ బాయ్ అనే వెబ్ సిరీస్ ద్వారా ఓటీటీ ప్రపంచంలో చాలా ఫేమస్ అయ్యారు. అయితే ఇందులో తనకంటే దాదాపు 24 సంవత్సరాలు పెద్దదైన నటితో రొమాంటిక్ సీన్స్ లో కనిపించి అభిమానులకు షాకిచ్చాడు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, లవ్ స్టోరీ చూసి ఆశ్చర్యపోయారు జనాలు. ఆ నటి మరెవరో కాదండి.. హీరోయిన్ టబు. వీరిద్దరు కలిసి ఏ సూటిబుల్ బాయ్ సిరీస్ లో నటించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇషాన్ మాట్లాడుతూ.. టబుతో సన్నిహిత సన్నివేశాల్లో నటించే సమయంలో ఎప్పుడూ భయపడలేదని అన్నారు. ఆమె తనకు సెట్ లో చాలా ఫన్నీ విషయాలు చెప్పేదని.. ఎక్కువగా భోజనం గురించి మాట్లాడుకునేవాళ్లమని.. అలాగే టబు చాలా సరదాగా ఉంటుందని.. సెట్స్ లో చిన్న అమ్మాయిలా ప్రవర్తిస్తుందని.. కెమెరా ముందుకు రాగానే వెంటనే పాత్రలోకి వచ్చేస్తుందని చెప్పుకొచ్చారు. ఈ సిరీస్ ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమాను అస్సలు మిస్ అవ్వకండి.

## ఎందుకు మేడమ్ అలా చేశారు..

ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా చక్రం తిప్పిన హీరోయిన్ ఇలియనా. దేవదాసు సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచమయైన ఆమె.. పోకిరి సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈమూవీతో ఇండస్ట్రీలో ఆమె కెరీర్ ఒక్కసారిగా మారిపోయింది. స్టార్ హీరోలతో వరుస అవకాశాలు అందుకుంటూ బిజీ హీరోయిన్ అయ్యింది. నటి ఇలియానాపై విధించిన నిషేధం గురించి కట్రగడ్డ ప్రసాద్ వివరంగా వెల్లడించారు. ఇలియానా ఒక తమిళ నిర్మాత రాజకాళియమ్మన్ (మోహన్ నటరాజన్) నుండి రూ. 40 లక్షల అడ్వాన్స్ తీసుకున్నారని, అయితే సినిమాకు డేట్లు ఇవ్వడంలో విఫలమయ్యారని, అడ్వాన్స్ ను తిరిగి ఇవ్వలేదని ఆయన తెలిపారు. దీంతో ఆ నిర్మాత సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ లో ఫిర్యాదు చేశారని. ఛాంబర్ సమావేశానికి హాజరుకావాలని ఇలియానాకు సమాచారం అందినా, ఆమె రాకుండా మేనేజర్ ను పంపారని ప్రసాద్ వివరించారు. ఛాంబర్ అధికారులు ఇలియానా డేట్లను ఆనంద్ సినీ సర్వీసెస్ నుండి లాగ్ షీట్ల ద్వారా పరిశీలించి, ఆమె ఖాళీగా ఉన్నప్పటికీ కమిట్ మెంట్ ను పాటించలేదని నిరూపించారు. అడ్వాన్స్ తిరిగి ఇవ్వమని కోరినా ఆమె నిరాకరించడంతో, ఛాంబర్ ఆమెపై నిషేధం విధించిందని ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ నిషేధం ఇప్పటికీ అమలులో ఉందని, దీని కారణంగా ఆమె సౌత్ లో ఏ సినిమా చేయలేదని తెలిపారు. అమర్ అక్బర్ ఆంటోనీ చిత్రం బహుశా నిషేధ ప్రక్రియ జరుగుతున్న సమయంలో పూర్తై ఉండవచ్చని, కానీ నిషేధం అమలులోకి వచ్చిన తర్వాత ఆమె ఏ సినిమాకు సంతకం చేయలేదని ఆయన వివరించారు. ఈ నిషేధం కారణంగా, ఇతర నిర్మాతలు ఇలియానాను తమ చిత్రాలకు ఎంపిక చేయకుండా నిరుత్సాహపరచబడ్డారని, ఎందుకంటే వారు 40 లక్షల బాకీని చెల్లించాల్సి వస్తుందని ప్రసాద్ పేర్కొన్నారు. కొత్త నిర్మాతలు సరైన బడ్జెట్ ప్రణాళిక లేకుండా చిత్రాలను ప్రారంభించి, మధ్యలో నిలిపివేస్తున్నారని తెలిపారు. క్యూబ్ లో 150కి పైగా ఆగిపోయిన సినిమాలు ఉన్నాయని, ప్రతి భాషలోనూ దాదాపు 200 సినిమాలు ఫస్ట్ కాపీ వచ్చిన తర్వాత కూడా విడుదల కాకుండా నిలిచిపోయాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఫైనాన్స్ సమస్యలు, నటీనటుల సమస్యలు దీనికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**